ఆత్రేయపురానికి మణిహారం

- రూ.1.40 లక్షలతో పార్క్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం
- శంకుస్థాపన చేసిన ఏడాదిలోపే పనులు పూర్తి
- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు చేతుల మీదుగా నేడు ప్రారంభం


ఆత్రేయపురంలో చెరువు చుట్టూ అభివృద్ధి చేసిన ట్రాక్

ఆత్రేయపురం: నిన్నటి వరకు నిరుపయోగం.. అందమైన ఆత్రేయపురాన్ని వెక్కిరిస్తున్నట్లు ఉండే చెరువు. ఊరి మధ్యలో ఉండటంతో తుప్పలు పెరిగిపోయాయి. విష పురుగులకు నిలయంగా ఉంది. నేడు పరిస్థితి మారింది. తుప్పలతో నిండి ఉన్న ఆ ప్రాంతం ఆహ్లాదాన్ని పంచే పార్క్‌గా తయారైంది. ఎన్నో ఏళ్లుగా వ్యర్థాలతో నిండి ఉన్న ఆ చెరువు నేడు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఆత్రేయపురానికి మణిహారంగా మారింది. సుమారు రూ.కోటి 50 లక్షలతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు ఆత్రేయపురం నడిబొడ్డున ఉన్న మంచినీటి చెరువును పార్కుగా అభివృద్ధి చేశారు. రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులతో ఈ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. గతంలో ఈ చెరువు నీటిని తాగునీరుగా ఉపయోగించేవారు. కొన్నేళ్లుగా నిరుపయోగంగానే ఉంది. ఊరి నడిబొడ్డున ఉండడంతో దీని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి భావించారు. దీని ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు గ్రామస్తులకు వాకింగ్ ట్రాకింగ్ ఏర్పాటు చేస్తే ఆరోగ్యం కూడా ఉంటుందని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఈ ప్రతిపాదన చేశారు. అనుకున్నదే తడవుగా ఈ విషయాన్ని రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ దృష్టికి తీసుకువెళ్లి, చకా చకా నిధులను కూడా మంజూరు చేయించారు. కాంట్రాక్టుకు టెండర్లు పిలవడం.. ఖరారు చేయడం.. వేగవంతంగా పనులు కూడా పూర్తి చేశారు. దీంతో ఆదివారం ఈ పార్క్, వాకింగ్ ట్రాక్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఆత్రేయపురం పూతరేకులు అంటే ప్రపంచ వ్యాప్తంగా విశిష్టత ఉంది. అలాంటి గ్రామంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా కనీసం ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదు. అలాంటిది సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే పల్లెసీమల్లో అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేశారు. అందులో భాగంగానే ఆత్రేయపురంలో ప్రారంభానికి సిద్ధమైన పార్క్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం. కేవలం శంకుస్థాపన చేసిన ఏడాది లోపే పార్క్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం పూర్తి చేశారు. ఉదయం వేళల్లో, సాయం సంధ్య వేళల్లో గ్రామస్తులు ఇక్కడ కాసేపు సేద తీరడానికి, ఆరోగ్యం కోసం వాకింగ్ చేయడానికి ఊరి మధ్యలో అనువుగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది



మా ఊరిలో పార్క్, వాకింగ్ చేసేందుకు ట్రాక్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. వృద్ధులు సాయంకాలం కాసేపు ఆ ట్రాక్‌పై నడిస్తే.. ఆరోగ్యంగా ఉంటారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాన్ని గతంలో ఎవరూ చేయలేదు. మా ఊరికి మంచి జరిగింది. – ముదునూరి రామరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్, ఆత్రేయపురం

గత పాలకులు పట్టించుకోలేదు



నిన్నటి వరకు తుప్పలతో నిండి ఉన్న చెరువు నేడు ఆరోగ్యాన్ని పెంచే పార్క్‌గా మారడం సంతోషంగా ఉంది. గతంలో ఎవరూ పట్టించుకోలేదు. నేడు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూనుకుని త్వరితగతిన పార్క్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం పూర్తి చేశారు.
– గాదిరాజు ప్రసాద్‌రాజు, ఆత్రేయపురం

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చొరవతోనే



కొత్తపేట ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి చొరవతో పార్క్ శరవేగంగా పూర్తి చేయగలిగాం. అత్యంత నాణ్యతా ప్రమాణాలతో ప్రజలందరికి ఉపయోగపడేలా పార్క్‌ను తీర్చిదిద్దాం.
– కృష్ణారెడ్డి, కాంట్రాక్టర్, ఊబలంక

మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- వానపల్లిలో నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ


వానపల్లిలో డ్వాక్రా సంఘాలకు నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాల మహిళల అభ్యున్నతి, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక పథకాలతో పరిపాలన సాగించారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. డ్వాక్రా రుణమాఫీకి సంబంధించి మండలంలోని వానపల్లి, వాడపాలెం, బిళ్లకుర్రు గ్రామాల్లో 'వైఎస్సార్ ఆసరా' నాలుగో విడత పంపిణీ కార్యక్రమం, మహిళలతో ఆత్మీయ సభను శనివారం వానపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సభలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో 79 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసి తిరిగి మహిళల ఖాతాలకు జమచేశారన్నారు. ఇలా దాదాపు ప్రతి పథకం మహిళల పేరున అమలు చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందామా? నేటి జగన్ ప్రభుత్వంలో లబ్ధి పొందామా అని ప్రతి ఒక్కరూ గుండెలపై చేయి వేసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. జగనన్నకు మరోసారి అధికారం ఇస్తే రెండింతల సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుస్తారన్నారు. అనంతరం 527 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి 5,270 మంది మహిళలకు రూ.4,38,41,100 కోట్లు నమూనా చెక్కును జగ్గిరెడ్డి మహిళలకు అందజేశారు.

అలాగే సభకు వచ్చిన మహిళల్లో 100 మందిని లక్కీడిప్ ఎంపిక చేసి రైస్ కుక్కర్లు అందజేశారు. ఆ కుక్కర్లను తన సోదరీమణుల చేతుల మీదుగా మహిళలకు అందజేశారు. అనంతరం మహిళలందరికీ ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులు కలసి వడ్డించారు. ముందుగా సభా వేదిక వద్ద దివంగత మాజీ సీఎం వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, ఏఎంసీ డైరెక్టర్ సాకా జానకిరామరాజు, జిల్లా పార్టీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, యువజన విభాగం సభ్యుడు ఇసుకపట్ల సునీల్, ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాల పంపిణీ

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- వానపల్లి, మోడేకుర్రుల్లో 1,237 మంది మహిళలకు ఇళ్ల స్థలాల స్వాధీనం


మోడేకుర్రులో ఇళ్ల స్థలాలు స్వాధీనం చేసి పసుపు కుంకుమలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ఆడపడుచుల సొంతింటి కలను సాకారం చేసేందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వానపల్లిలో సుమారు 9.175 ఎకరాల్లో 367 మందికి, మోడేకుర్రులో సుమారు 21.65 ఎకరాల విస్తీర్ణంలో 866 మంది మహిళలకు ఇళ్ల స్థలాల స్వాధీనం కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు కేటాయించిన స్థలాలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్వాధీనం చేశారు. లబ్ధిదారులకు స్థలం పట్టాతో పాటు జగ్గిరెడ్డి వ్యక్తిగతంగా పసుపు, కుంకుమ, గాజులు, రవిక అందజేశారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను కేటాయించడమే కాక దేశంలోనే తొలిసారిగా ఆ స్థలాలపై ఆడపడుచులకు సర్వ హక్కులు కల్పిస్తూ వారి పేరునే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి స్థిరాస్తి కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గంలో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో, మళ్లీ నేటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన అదృష్టం తనకే దక్కిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇంత భారీ సంఖ్యలో జగన్ ప్రభుత్వం తప్ప మరే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల మహిళల పేరునే ఇళ్ల స్థలాలు కేటాయించడం ద్వారా ఆ కుటుంబానికి ముఖ్యంగా మహిళకు సమాజంలో గౌరవాన్ని కల్పించామన్నారు. నియోజకవర్గంలో 343.98 ఎకరాల భూమి సేకరించి, 17,190 మందికి పట్టాలుగా ఇవ్వడం సరికొత్త రికార్డు అని అన్నారు. దాదాపు ప్రతి స్థలం రూ.6 లక్షలు నుంచి రూ.10 లక్షలు విలువ చేస్తుందన్నారు. దీన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. రేపు మళ్లీ జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ లేఅవుట్లలో రోడ్లు వేసి, విద్యుత్ సౌకర్యం కల్పించి, ఇళ్లు కట్టించే కార్యక్రమం చేపడతామన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక్క జగన్ ప్రభుత్వమేనన్నారు. భవిష్యత్‌లో కూడా ఈ పథకాలన్నీ అమలు చేసే సత్తా ఒక్క జగన్‌కే ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కరరామం, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, డీసీసీబీ పర్సన్ బండారు రాజా, సర్పంచ్‌లు కుడుపూడి రామలక్ష్మి, రెడ్డి చంటి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సాకా జానకిరామరాజు, బీసీ విభాగం సభ్యుడు వనుం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

కొత్తపేట: నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రధాన గ్రామాలతో పాటు శివారు గ్రామాల్లో తాగునీరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. వానపల్లి పంచాయతీ పరిధిలోని 16 శివారు గ్రామాలకు సంబంధించి రూ.5.94 కోట్లతో 10 ట్యాంకులు, పైపులైన్లకు బిళ్లకుర్రు పంచాయతీ పరిధిలోని 13 శివారు గ్రామాలకు సంబంధించి రూ.4.16 కోట్లతో 5 ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణానికి ఆయా గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో తాగునీరు సమస్య అనేది లేకుండా గోదావరి నీటిని శుద్ధి చేసి సురక్షిత తాగునీరుగా సరఫరాకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు.

2004లో వైఎస్సార్ ప్రభుత్వంలో నియోజకవర్గానికి మంజూరు చేయించుకుని, రావులపాలెంలో నిర్మించుకున్న పథకం తరహాలోనే ఇప్పుడు కోనసీమలో అన్ని మండలాలకు సంబంధించి మన నియోజకవర్గంలోనే భారీ ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అలాగే స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుమారు పదేళ్ల క్రితం యూజీసీ నిధులు రూ.60 లక్షలు మంజూరు కాగా రూ.35 లక్షలతో నిర్మాణం చేపట్టిన తరువాత వివిధ కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయిన హాస్టల్ భవనం రూ.25 లక్షల పెండింగ్ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరాయపురంలో వైజ్ఞానిక ప్రదర్శన


విద్యార్థులు రూపొందించిన సైన్స్ పరికరాలను వీక్షిస్తున్న ఉపాధ్యాయులు

మలికిపురం: జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద ఉన్నత పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. రైలు పట్టాలు దాటేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ఉండేలా 8వ తరగతి విద్యార్థిని పీబీ సాధిక తయారు చేసిన రైల్వే రక్షణ ప్లాట్‌ఫాం నమూనా అందరినీ ఆకట్టుకుంది. లౌక్యశ్రీ,హన్సిక రూపొందించిన చంద్రయాన్-3 నమూనా అలాగే స్పీడ్‌బ్రేకర్ వద్ద విద్యుత్ ఉత్పత్తి, 7వ తరగతి విద్యార్థిని ఎ.గీతికాశ్రీ తయారు చేసి ప్రదర్శించిన ఆటోమేటిక్ సిలైన్ కంప్లీషన్ అలారం వంటి సుమారు 200 ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విశ్వేశ్వరాయపురం సర్పంచ్ సీహెచ్ హెలీనా రిబ్బన్ కట్ చేసి ఎగ్జిబిషన్ ప్రారంభించగా, మండల విద్యాశాఖాధికారిణి ఎం.విజయశ్రీ, ఎంఈవో-2 వైపీ సత్యనారాయణ, జేవీవీ జెండా ఎగురవేసి జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ వేడుకలు ప్రారంభించారు.

కార్యక్రమంలో జేవీవీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఈఆర్ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పర్యావరణ కమిటీ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివ, రోటరీ ప్రెసిడెంట్ యస్.మురళీకృష్ణ, తాడి సహదేవ్, ఎస్.రమేష్ బాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కరెస్పాండెంట్ పీవీవీ వర ప్రసాద్ పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేసి విజయకేతనం ఎగురవేద్దాం

జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి వేణుగోపాలరావు


పసుపల్లిలో ఇన్‌చార్జి వేణుగోపాలరావును, మండల అధ్యక్షుడు శేఖర్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

అంబాజీపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించేందుకు ఎటువంటి విభేదాలు లేకుండా కలసికట్టుగా పనిచేసి విజకేతనం ఎగురవేద్దామని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. పసుపల్లిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ అధ్యక్షతన పార్టీ నాయకులు, గ్రామ పెద్దలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి వేణుగోపాలరావు మాట్లాడుతూ కులమతాలు, పార్టీల భేదం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజారంజక పాలన సాగిస్తూ దేశాలకే ఆదర్శంగా నిలిచి మన్ననలు పొందుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ సీఎం జగనన్న నెరవేర్చడమే కాకుండా నవరత్నాల్లోని పథకాలను అర్హులందరికీ అందజేశామన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి కుటుంబం రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి వేణుగోపాలరావును, ఇటీవల నూతనంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన విత్తనాల శేఖర్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, గంటి శ్రీను, మామిళ్లపల్లి కృష్ణమూర్తి, వాసంశెట్టి పెదబాబు, మట్టపర్తి హరి, గంటి సత్తిబాబు, దొమ్మేటి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల చెంతకే పాలన


లూటుకుర్రులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. లూటుకుర్రులో రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను, నగరంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు శనివారం ప్రారంభించారు. జరిగిన సమావేశాల్లో మాట్లాడుతూ విద్యతో పాటు వైద్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకే వైద్య సేవలను చేరువ చేశారన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు జగన్‌కు తోడుగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీకి విజయం అందించి మరింత అభివృద్ధి సాధించే దిశగా ప్రోత్సాహం అందించాలని చిట్టిబాబు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన డైరెక్టర్ చింతా కుమారి, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, జాలెం రమణకుమారి, ఎంపీటీసీలు నామన వెంకటేశ్వరరావు, జాలెం అనూష, కో-ఆప్షన్ సభ్యుడు నూర్జైన్ అబ్బాస్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు అడబాల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.


కొబ్బరి వృక్ష మిత్రలు రైతులకు అండగా ఉండాలి


అంబాజీపేటలో కొబ్బరి వృక్ష మిత్రులకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న డిప్యూటీ డైరెక్టర్ కుమార్‌వేల్, అధిపతి చలపతిరావు

అంబాజీపేట: కోనసీమలో కొబ్బరి రైతులకు సమస్యగా మారిన దింపు కార్మికుల కొరతను అధిగమించేందుకు కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ) ద్వారా ప్రవేశపెట్టిన కొబ్బరి వృక్ష మిత్రలు రైతులకు అండగా ఉండేందుకు కృషి చేయాలని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు సూచించారు. స్థానిక పరిశోధన కేంద్రంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న కొబ్బరి వృక్ష మిత్రల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. చలపతిరావు మాట్లాడుతూ కోనసీమలోని యువకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో భాగంగా కొబ్బరి చెట్టు ఎక్కే పరికరం ఉపయోగించి చెట్లు ఎక్కడంలో నైపుణ్యంపై పోటీలు నిర్వహించారు. బూడిద విజయ్, బూడిద సంజీవ కుమార్, బొక్కా శ్రీనివాసరావు (గంగలకుర్రు)లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి బహుమతులతో పాటు శిక్షణ ధ్రువీకరణ పత్రాలు, క్లైంబర్స్‌ను యువకులకు డాక్టర్ చలపతిరావు, సీడీబీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కుమార్‌వేల్‌లు అందజేశారు. ఈ ముగింపు కార్యక్రమంలో తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, శాస్త్రవేత్త బి.నీరజ, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.అనూష, ఉద్యాన శాస్త్రవేత్త ఎ.కిరీటీ, ఏఈఓ పి.శశికళ, మాస్టర్ ట్రైనీలు పి.సోమశేఖర్‌బాబు, ఇ.వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ పూజలు


పెదపట్నంలో కల్యాణం జరిపించిన ఆబోతు-ఆవు

మామిడికుదురు: పాశర్లపూడిలో శ్రీ, భూ సమేత చెన్న కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠా మహోత్సవం పూజలు శనివారం ఘనంగా జరిగాయి. విఘ్నేశ్వర పూజ, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, శాంతి హోమం తదితర పూజలను వైభవంగా జరిపించారు. ఆలయ ఈఓ ఎన్‌వీఎస్‌వీ ప్రసాదరాజు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. పెదపట్నంలో వేంకటేశ్వర స్వామి ప్రతిరూపంగా భావించే ఆబోతుకు, లక్ష్మీదేవి స్వరూపమైన గోమాతకు కల్యాణం ఘనంగా జరిపించారు. ఆబోతుతో పాటు ఆవును చూడ చక్కగా అలంకరించి కల్యాణ క్రతువు జరిపించారు. ముత్యాల గణపతి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణంలో పలువురు భక్తులు పాల్గొని ఆబోతు, ఆవు చుట్టూ ప్రదక్షిణ చేసి పూజలు నిర్వహించారు.

వైభవంగా విశ్వేశ్వరుడికి త్రిశూల స్నానం

అంబాజీపేట: మాచవరం శివారు కోటివారి అగ్రహారంలో కొలువుదీరిన భువనేశ్వరీ సమేత విశ్వేశ్వర స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలను పురస్కరించుకుని త్రిశూల స్నానాన్ని శనివారం నిర్వహించారు. అంతకుముందు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి స్వామివారి పుష్పోత్సవ వేడుకలను జరపనున్నామన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: అప్పనపల్లిలో వీరభద్రస్వామి సంబరం సోమవారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, నృత్యాల నడుమ వైనతేయ గోదావరి నది వరకు స్వామిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం నది వద్ద తులా గోపాలకృష్ణ, నాగసూర్యావతి దంపతులతో పాటు కంకిపాటి హేమంత్‌నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో వీరభద్రస్వామి సంబరాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేద పండితులు స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

లోకకల్యాణార్థం అయినవిల్లిలో గోపూజ

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలో మానేపల్లి వెంకట సుబ్బారావు దంపతుల ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం శనివారం గోపూజ నిర్వహించారు. వేదపండితులు కప్పగంతుల చంటి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపారు. హిందూ సంప్రదాయంలో గోపూజకు విశిష్టత ఉందన్నారు. గోపూజ అనంతరం గోవును వెంకటసుబ్బారావు దంపతులు వేద పండితులకు దానం ఇచ్చారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

ఆరోగ్యశ్రీ కార్డులు అందరికీ అందజేయాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేయడంతో పాటు సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైద్యాధికారి పి.భవానీశంకర్, డి.సాయి కిశోర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం వైద్యారోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం జరిగింది. జనవరి నెలలో సాధించిన ప్రగతిని అధికారులకు ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం సబ్‌సెంటర్ల వారీగా వైద్యాధికారులు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా 'చీకరమెల్లి'

పి.గన్నవరం: జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బెల్లంపూడి గ్రామానికి చెందిన చీకరమెల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు, జిల్లా అధ్యక్షుడు వై.వెంకటమోహన్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా చేతుల మీదుగా నియామక పత్రాలను శ్రీనివాసరావు అందుకున్నారు. శ్రీనివాసరావును జిల్లా ఇన్‌చార్జి పి.రామ్మోహన్‌రావుతో పాటు పలువురు నాయకులు అభినందించారు.

24 సీట్లకే అమ్ముడు పోయావా పవన్

మలికిపురం: కాపుల మనోభావాలను పక్కనపెట్టి 24 సీట్లకే అమ్ముడు పోయావా పవన్ అని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మంగెన సింహాద్రి ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మలికిపురంలో విలేకరులతో మాట్లాడుతూ ఇన్నాళ్లూ సీఎం అవుతానని ప్రగల్భాలు పలికిన పవన్ ఈ రోజు 24 సీట్లలో పోటీ చేసి ఎన్ని గెలుస్తావ్, ఎలా సీఎం అవుతావని ప్రశ్నించారు.

ఎస్.మూలపాలెంలో ఫ్యామిలీ డాక్టర్

అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో శనివారం నిర్వహించారు. ఈ ప్రోగ్రాం 30 మందికి వైద్యసేవలు అందించినట్లు వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యులు లక్ష్మీ సౌజన్య తెలిపారు. ఇందులో ఇద్దరు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరిని వీరవల్లిపాలెం పీహెచ్‌సీకి రిఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి యూగశ్రీ, 104 డీఈఓ ప్రశాంతి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా శ్రద్ధగా చదవాలి


విద్యార్థులకు పరీక్ష అట్టలు అందిస్తున్న మూర్తి

రాజోలు/పి.గన్నవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా శ్రద్ధగా చదవాలని మాజీ ఐఆర్‌ఎస్ అధికారి తాళ్ల సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం శివకోడులో గురుకుల బాలిక పాఠశాలను ఆయన సందర్శించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు 80 మందికి సరస్వతి ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు, పెన్నులు అందజేశారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు పదో తరగతి పబ్లిక్ పరీక్ష తొలి మెట్టు అన్నారు. నాయకులు గునిశెట్టి చినబాబు, నాతి శ్రీనివాసరావు, తాళ్ల సాంబమూర్తి, బొంతు శ్రీను, నెల్లి దుర్గాప్రసాద్, స్టూడియో వర్మ, రావి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమి యాత్రికులకు ప్రసాద వితరణ

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా పౌర్ణమి పుణ్యస్నానాలకు వెళ్లే భక్తులకు శనివారం తాటిపాక సెంటర్‌లో ప్రసాద వితరణ చేశారు. స్థానిక అంతర్వేది ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహం వద్ద మహా గజమాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. అంతర్వేదిలో కూడా భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టామని మహా గజమాల యాత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చింతా మహానాగరాజు తెలిపారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ నాయకులు తిరుమాని ఆచార్య, సంకరపు ఆదినారాయణ, ఇల్లింగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శివకుమార్‌కు సత్కారం


శివకుమార్‌ను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరానికి చెందిన నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్‌ను శనివారం సఖినేటిపల్లిలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి విజయానికి కృషి చేసేలా పార్టీ తరఫున ఆయా నియోజకవర్గ పరిశీలకులుగా అధిష్టానం నియమించిన వారిలో శివకుమార్ ఉన్నారు. ఈ మేరకు శివకుమార్‌ను జగ్గంపేట నియోజకవర్గానికి నియమించారు. మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, ఎంపీటీసీ నల్లి రత్నకుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు రుద్రరాజు రంగరాజు, నాయకులు నల్లి మోహన్, గెడ్డం అమ్ములు, నల్లి సుధీర్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలకుడిగా సీఎం జగన్


రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

రాజోలు: సంక్షేమ పాలకుడిగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచారని రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ అన్నారు. శనివారం రాజోలు నియోజకవర్గం పర్యటనకు విచ్చేసిన ఆయనకు తాటిపాకలో పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉభయగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి ఆధ్వర్యంలో ప్రసాద్‌ను వెండి పుష్పమాలతో ఘనంగా సత్కరించారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని విజయపథంలో నిలిపేందుకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నట్టు ప్రసాద్ వివరించారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఆర్య వైశ్య సంఘ నాయకులు కాసు శ్రీనివాస్, పోశెట్టి సూరిబాబు, లక్కింశెట్టి బాబులు, యెండూరి రమేష్, లక్కింశెట్టి నానాజీ, హరి తదితరులు పాల్గొన్నారు.